# నిజం

రాధిక నోరి, Tallahassee, FL

'అభయా!'

'ఊఁ'

'అభయా...'

'ఊఁ...'

'అబ్బా, అభయా.....'

'అబ్బా, ఊఁ.....'

'అలా మౌనంగా వుంటావేమిటీ? ఏదన్నా మాట్లాడు.'

'బాగుంది. ఏదో మాట్లాడాలని ఇక్కడకు రమ్మన్నది నువ్వు. పైగా నేను మాట్లాడలేదంటావేమిటి?' అభయ అలా దబాయించేసరికి సుకుమార్ కొంచెం తడబడ్డాడు.

'రమ్మన్నాననుకో. నువ్వు రేపు వూరెళ్తున్నావు కదా! మళ్ళీ చాలా రోజులదాకా కలవటానికి వీలుకాదని రమ్మన్నాను.'

'మరి ఏం చెప్పాలనుకున్నావో త్వరగా చెప్పు. మళ్ళీ నేను హాస్టలుకి వెళ్ళి రేపటి ప్రయాణానికి అన్నీ సర్దుకోవాలి.' అభయ తొందర చేసింది.

'మళ్ళీ ఎప్పుడొస్తావు అభయా?' బెంగగా అడుగుతున్న సుకుమార్‌ని చూస్తే నవ్వు వచ్చింది అభయకు.

'అంత దిగులుపడతావెందుకు కుమార్? యూనివర్సిటీ మళ్ళీ తెరవగానే వచ్చేస్తాను. అయినా సెలవులకి వూరెళ్ళటం మామూలేగా!' చాలా తేలికగా అంది అభయ.

'ఏమో బాబూ! నువ్వెప్పుడు వూరెళ్ళినా మళ్ళీ ఎప్పటిలాగే తిరిగి వచ్చే దాకా నాకు చాలా భయంగా వుంటుంది. అసలే మీ ఇంట్లో అందరూ నీ పెళ్ళి ఎప్పుడెప్పుడు చేద్దామా అని కాచుకుని కూర్చున్నారు. ఇంకా నిన్ను ఇలా ఎన్ని రోజులు వుంచుతారు?' సుకుమార్ గొంతులో ధ్వనించిన అపనమ్మకానికి, భయానికి నిజంగా నవ్వొచ్చింది అభయకి.

'అదా నీ భయం! అలాంటి సందేహాలేవీ పెట్టుకోకు. నా కిష్టం లేకుండా నా పెళ్ళి ఎవ్వరూ చేయలేరు. ఈ అభయ అంటే ఎవరనుకున్నావు?' ధీమాగా అంటున్న ఆమె వైపు తదేకంగా చూసాడు కుమార్.

'నీకింకా నమ్మకం కుదర లేదా? పోనీ ఇప్పుడే పెళ్ళి చేసేసుకుందామా?' అల్లరిగా నవ్వుతున్న అభయను చూస్తే ఏం చెప్పాలో తెలియలేదు సుకుమార్‌కి. మౌనంగా వుండిపోయాడు. కాస్సేపటికి కానీ అభయకు అతను నిజంగా వర్రీడ్‌గా వున్నాడని తెలియలేదు.

'ఏమైంది కుమార్, ఎందుకలా వున్నావు?' ఆతురతగా అడిగింది ఆమె.

'ఏమీ లేదు. ఇంటినుండి మళ్ళీ వుత్తరం వచ్చింది.' నెమ్మదిగా అన్నాడతను.

'ఏమని?'

'ఎప్పటి విషయమే! అక్కకి అత్తవారింట్లో కష్టాలు ఇంకా ఎక్కువైనాయట. కట్నం పూర్తిగా ఎప్పుడు తీసుకొస్తావంటూ వత్తిడి చేస్తున్నారట.' అతన్ని పూర్తిగా చెప్పనివ్వకుండా మధ్యలోనే ఆపేసి అన్నది అభయ,

'దీనితో పాటు నీకు లక్షలు ఇస్తామంటూ వాళ్ళూ వీళ్ళూ అడుగుతున్నారు. నీకొచ్చే కట్నంతో అక్కని కష్టాలలోంచి బయటకు లాగొచ్చు. తమ్ముడికి అనుకొన్నట్లుగా మెడిసన్ చెప్పించవచ్చు. అని కూడా రాసుంటారు. అవునా?' కోపంగా అంది ఆమె.

'ఏం చెయ్యాలో తెలియటం లేదు అభయా! బాధ్యతలని సక్రమంగా నిర్వహించలేక పోతున్నానేమోనని భయంగా వుంది. నాన్నగారు, అమ్మ పెద్దవారయ్యారు. ఈ ముసలి వయసులో వారి మనస్తాపాన్ని దూరం చేయలేక పోతున్నాను. చేతికి అందొచ్చిన కొడుకు ఏదో వుద్ధరిస్తాడంటూ కలలు కంటున్న వాళ్ళని ఇంకా ఎన్నాళ్ళు ఇలా ఆశపెడుతూ మురిపించాలో? నేను చేస్తున్న ఈ గుమాస్తాగిరీలో ఎన్ని వేలని దాచగలను? ఎప్పటికి అక్కని ఆ కష్టాల కడలి లోంచి బయటకు లాగగలను? తమ్ముడిని డాక్టరు ఎప్పటికి చేయగలను? ఇవన్నీ జరిగే పనులేనా?' నిరాశగా, అపనమ్మకంగా అంటున్న సుకుమార్‌కి ధైర్యం చెపుతూ అంది అభయ,

'ఎందుకు జరగవు కుమార్? ఈ ఘనకార్యాలన్నీ నువ్వే నిర్వహిస్తావు చూస్తూ వుండు. ఇట్ ఈజ్ ఓ మేటర్ ఆఫ్ టైం. కొన్ని నెలల్లో నా థీసిస్ కూడా పూర్తయిపోతుంది. మా ప్రొఫెసరు చాలా స్ట్రాంగ్‌గా రికమెండు చేస్తానన్నారు. అతి త్వరలో నాకు ఎక్కడో అక్కడ మంచి జాబ్ వస్తుంది. అప్పుడు నేను కూడా నీకు సహాయం చేయగలను. కుమార్! మనిద్దరం కష్టాలు పడన్నా నీ సమస్యలను పరిష్కరిద్దాం.' ఎంతో ప్రేమగా, అనునయంగా అంది అభయ.

'అప్పటిదాకా మా వాళ్ళను ఎలా ఆపగలను? మన ప్లాన్లు ఏ మాత్రమూ తెలియని మా అక్క ఈ లోపల ఏ అఘాయిత్యమో చేసుకుంటే నేనేం చెయ్యాలి?' భయంగా అంటున్న అతన్ని చూస్తే నిజంగా కోపం వచ్చింది అభయకు.

'కుమార్! నీకనేకసార్లు చెప్పాను, ప్రతీదానికీ ముందు కీడు వూహించవద్దని. ఏమి జరగక మునుపే ఏదో జరుగుతుందేమోనని అనవసరంగా భయపడతావెందుకు? నీ నెగెటివ్ ఎప్రోచ్ నాకస్సలు నచ్చదు. అసలు ఆ మాటకొస్తే మీ అక్క ఆత్మహత్య ఎందుకు చేసుకోవాలి? చావు సమస్యలను పరిష్కరిస్తుందా? పెళ్ళాన్ని తన కళ్ళముందే అన్ని కష్టాలు పెడుతూంటే చూస్తూ కూడా ఏమీ చెయ్యకుండా వూర్కొంటున్న ఆ చవటని వదిలేసి వచ్చేస్తే మీ ఇంట్లో మాత్రం కాదంటారా? ఇవాళ కట్నం కోసం హింసలు పెడుతున్న వాళ్ళు నువ్వు డబ్బు పూర్తిగా ఇస్తే మాత్రం రేపు మళ్ళీ ఇంకోదానికి సాధింపు మొదలెట్టరని నమ్మకం ఏమిటి? నాలాంటిది కోడలుగా వస్తే తెలిసేది వాళ్ళకి.' కోపంగా అంటున్న అభయతో అన్నాడు అతను.

'అలా అన్యాయంగా మాట్లాడకు అభయా! డాక్టరేట్ తీసుకోబోతూ వుద్యోగస్తురాలవు కాబోతున్న నీకు హైస్కూలన్నా పూర్తి చేయని మా అక్కకు పోలికా? బుద్ధి పూర్తిగా వికసించక మునుపే పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోయి పిల్లల్ని కంటూ అనుక్షణమూ వాళ్ళందరికీ సేవలు చేస్తూ అత్తవారింట్లో తనకు కనీసం తన భర్త పాదాల దగ్గర స్థానం లభించినా మహాప్రసాదం అని సంతోషపడే ఒక చదువు లేని అమాయక స్త్రీకి, విద్యతో పాటు తెలివి కూడా పుష్కలంగా వున్న నీలాంటి యువతికి వుండే ఆత్మ విశ్వాసం రమ్మంటే ఎలా వస్తుంది?' అన్నాడతను.

'అలాంటప్పుడు ఆ ఆత్మవిశ్వాసాన్ని నువ్వు కలగజేయటానికి ప్రయత్నించాలి. కాని తాత్కాలిక సర్దుబాట్లు చేస్తానంటావేమిటి?' మళ్ళీ కోపంగా అంది అభయ.

'అబ్బా, అభయా! నువ్వు చెప్పే సలహాలన్నీ ఐడియల్‌గా వున్నాయి. కానీ ప్రాక్టికల్‌గా లేవు. ఇవన్నీ జరిగే పనులు కావు.' విసుగ్గా అన్నాడతను.

'అయితే ఏమంటావు? పోనీ మీవాళ్ళు తెచ్చిన సంబంధం ఏదన్నా చేసేసుకుని ఆ కట్నంతో మీ అక్క సమస్యని పరిష్కరిద్దామని నీ ఆలోచనా? ఇది చెప్పటానికా నన్ను రమ్మన్నావు?' కోపంగా అంది అభయ.

'అబ్బా, అంత కోపం ఎందుకు అభయా? తొందరపాటు కూడదని నాకు చెప్తూ నువ్వు మాత్రం ఏం చేస్తున్నావు? కట్నంకి ఆశపడే వాడినే అయితే ఇన్ని రోజులూ ఇలా వుండేవాడినా? ఏదో నా బాధలని వెళ్ళబోసుకుని కాస్త భారంని తగ్గించుకుందామనుకుంటే నీ అలకతో నన్నింకా బాధ పెడుతున్నావు.' నిస్సహాయంగా ధ్వనించిన అతని గొంతుని వింటూంటే అభయకి సుకుమార్ మీద భలే జాలేసింది.

'కుమార్, పోనీ కాస్సేపు నేనేమీ మాట్లాడనులే.నువ్వేం చెప్పదలుచుకున్నావో అంతా చెప్పేసేయి.' కొంచెం పక్కకు జరుగుతూ అంది అభయ.

'జాగ్రత్త అభయా! కాలు జారేను. అసలే ఈ వంతెన సగం

కూలిపోయింది.' విరిగిన ఆ వంతెన వైపు, వేగంగా ప్రవహిస్తున్న ఏరు వైపు భయంగా చూస్తూ ఆదుర్దాగా అన్నాడతను.

'కాలు జారితే మాత్రం ఏమవుతుందేమిటి?' అల్లరిగా అంటున్న ఆమెతో

'అలా అనకు అభయా! నీకేమన్నా అయితే నేనేమవ్వాలి? నువ్వే అంటూ వుంటావుగా నేను పిరికివాడినని. నాలాంటి పిరికివాడికి నీలాంటి ధైర్యవంతురాలు తోడుగా లేకపోతే ఎలాగ?' ఎంతో సిన్సియర్‌గా అంటున్న సుకుమార్‌ని చూసి పకపకా నవ్వింది అభయ.

'కుమార్! నువ్వు వట్టి పిరికివాడివే కాదు. చాలా భావుకుడువి కూడా! అసలు నాలాంటి రాక్షసికి, నీలాంటి మంచి బాలుడికి ఈ ప్రేమని ఎలా పెట్టాడో ఆ దేవుడు?' తమాషాగా చేతులు తిప్పింది అభయ.

మెల్లగా చీకట్లు కమ్ముకుంటున్నాయి. పక్షులు గూటికి వెళుతూ చేసే కిచకిచలు, ప్రవహిస్తున్న నీళ్ళు చేసే హోరూ ఆ నిశ్శబ్దంలో తమాషా శబ్దాలని చేస్తున్నాయి. ఎవ్వరూ లేని ఆ ఏకాంతంలో, మధురంగా వున్న ఆ నిశ్శబ్దంలో, ఆ సాయం సమయంలో అభయ మనోహరంగా కనిపించింది సుకుమార్‌కి.

'అభయా! కొండల చాటున క్రిందికి క్రుంగుతున్న ఆ సూర్యుడి ఎరుపు నీచెక్కిళ్ళలో మెరుస్తోంది. నిశ్శబ్దంగా వున్న ఈ వాతావరణం, పచ్చగా వున్న ఈ చెట్లు, విరగబూసిన ఈ పూలు, సగం కూలిపోయినా కూడా అదోరకమైన అందంతో వింతగా వున్న ఈ వంతెన, వీటన్నికంటే కూడా అందంగా వున్న నువ్వు.....' ఇంకా ఏదో అనబోతున్న అతడిని మధ్యలోనే ఆపేస్తూ అంది అభయ,

'స్టాప్, స్టాప్, అబ్బాయిగారికి కవిత్వం కూడా వచ్చేస్తోంది. ఇంక ఇంటికి వెళ్ళకపోతే అపాయం తప్పేట్లు లేదు.' తమాషాగా అంటూ లేచింది అభయ.

'ఇంకొంచెం సేపు వుండు అభయా!' బ్రతిమాలుతూ అంటున్న అతడితో,

'నీకేం బాబూ, ఎంతసేపన్నా ఇలాగే కబుర్లు చెపుతానంటావు. మరీ ఎక్కువ చీకటి పడితే మా వార్డెను నిలదీస్తుంది నన్ను. అయినా నాకు నీ అంత సౌందర్యోపాసన లేదు బాబూ! ఎప్పుడూ వుండే ఈ చెట్లు, రోజూ అలవాటుగా అస్తమించే సూర్యుడు, సహజంగా పూస్తూ పరిమళాలు వెదజల్లే ఈ పూలు, ఏదో వయసులో వుండి కాస్త మెరమెరగా వుండే పడుచుపిల్ల, వీటిలో వింతేముంది? ఇవన్నీ రోజూ వుండేవేగా! సగం కూలిపోయిన ఈ వంతెనలో కూడా అందాన్ని చూసిన నీ రసికతకి నా జోహార్లు కానీ ఇక ఇంటికి వెళ్దాం పద.' ప్లేఫుల్‌గా అంటూ సుకుమార్‌ని ఏడిపించటానికి పరిగెత్తటం మొదలెట్టింది అభయ. ఆమె వెనక ఆగమంటూ కుమార్ తరుముతున్నాడు.

సరసాలాడుతూ సరదాగా ఒకరి వెనక ఒకరు పరిగెడుతున్న ఆ ఇరువురినీ సగం విరిగిపోయి ఆ మిగతా కూడా కూలిపోవటానికి సిద్ధంగా వున్న ఆ వంతెన చాలా మోసం చేసింది. నవ్వుతూ పరుగులు తీస్తున్న అభయ తన కాలు జారటం కానీ, వెంటనే క్రింద ఏటిలో పడిపోవటం కానీ సుకుమార్ గమనించ లేదు. అతను తెలివి తెచ్చుకుని ఏం జరిగిందో గమనించేసరికి ఇంకేమీ మిగల లేదు. అంతా రెప్పపాటులో జరిగిపోయింది.

'అభయా!' హృదయ విదారకంగా గట్టిగా అరచిన అతని అరుపు మాత్రం ఆ పరిసరాల్లో ప్రతిధ్వనించింది. ఏం చేయాలో తెలియక, షాకు తిన్న వాడిలాగ నిలుచుండి పోయాడు అతను. అతనికి ఈత రాదు.

అభయ లేనిదే తన జీవితమే లేదని, ఆమె లేకపోతే తనకి ఇంక బ్రతుకే లేదని, చావైనా బ్రతుకైనా కలిసే వుంటాలని మనస్ఫూర్తిగా కోరిన కోరికలు, చేసుకున్న వాగ్దానాలు అతని కప్పూడు గుర్తు రాలేదు. తన మీదే ఎన్నో ఆశలు పెట్టుకున్న ముసలి తల్లితండ్రులు, అసహాయంగా కష్టాల భారాన్ని మోస్తున్న అక్క, భవిష్యత్తుపై ఎంతో ఆశతో తన సహాయం కోసం ఎదురు చూసే తన తమ్ముడు.....వీరందరూ గుర్తుకు వచ్చారు. ఆ నిముషంలో తన కోరికలన్నీ అబద్ధాలుగా, తన బాధ్యతలే సత్యాలుగా తోచాయి సుకుమార్‌కి.

భారమైన హృదయంతో మౌనంగా ఇంటిముఖం పట్టాడతను. వీటన్నింటికీ ప్రత్యక్ష సాక్షి ఆ ఏరు మాత్రం ఎప్పటిలాగే ఏమీ మార్పు లేకుండా, ఏమీ ఎరగనట్లు అలా వేగంగా ప్రవహిస్తూనే వుంది.


# Peter Santhosh Kollory

**Attorney at Law**

216 Stelton Road, Suite A-1
Piscataway, NJ 08854
(908) 424-0505

General practice of law with emphasis on immigration, wills, estates, taxes, credits, collections and other legal matters. Available in the evenings and weekends for consultation. Please note fluency in TELUGU.


## చెమట

"మన కంపెనీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ చెమటోడ్చి పనిచేయాలి. అది చూసుకోవాల్సిన బాధ్యత నీదే' అంటూ ఓనర్‌గారు నా దగ్గర అన్నారు"

"అలాగా! మొదటగా నువ్వేం చేశావ్?"

"ఆఫీస్‌లో ఎవరూ ఫేన్ వేసుకోకూడదని సర్క్యులర్ పంపాను."

\- శ్రీనివాస్



